క్లుప్తంగా

పరామర్శ

పీలేరు రూరల్ : పట్టణంలో పాత రైల్వే గేటు వీధికి చెందిన మాజీ ముతవల్లి షామియానా ఖాజాపీర్ మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, శుక్రవారం మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. మృతుని కుటుంబానికి ప్రగాఢ సంతాపం తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ హబీబ్‌బాషా, ఎంపీటీసీ జోహార్, కలీమ్ తదితరులు పాల్గొన్నారు.

లలిత సహస్రనామ హోమం



పెద్దతిప్పసముద్రం : మార్గశిర మాసం సందర్భంగా స్థానిక శివాలయం సేవకులు సనగరం పట్టాభి రామయ్య ఆధ్వర్యంలో శుక్రవారం లలితనామ సహస్రనామ హోమాన్ని ఘనంగా నిర్వహించారు. అదే విధంగా కర్ణాటక రాష్ట్రంకు చెందిన వేద పండితుల మంత్రోచ్ఛారణల నడుమ ఆలయంలో లక్ష్మీ అమ్మవారికి అభిషేకం, కలశ స్థాపన, పూర్ణాహుతి, మహా మంగళ హారతి కార్యక్రమాలను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి స్వామి వారి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

ప్రయాణికులకు మెరుగైన సేవలు

మదనపల్లె సిటీ : ఆర్టీసీలో ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించాలని ప్రజారవాణాధికారి (డీపీటీఓ) రాము అన్నారు. శుక్రవారం మదనపల్లె-2 డిపోలో బస్సుల కండిషన్‌ను పరిశీలించారు. బస్సులు గ్యారేజీ నుంచి బయటకు వచ్చేటప్పుడు కండిషన్ చూసి ఇవ్వాలన్నారు. ఎలాంటి ఫిర్యాదు రాకూడదన్నారు. డ్రైవర్లు వాహనాలు నడిపేటప్పుడు జాగ్రత్తలు పాటించాలన్నారు. కార్యక్రమంలో ఎంఎఫ్, గ్యారేజీ సిబ్బంది పాల్గొన్నారు.

చిన్నారులకు అన్నదానం

పెద్దతిప్పసముద్రం : మండలంలోని తుమ్మరకుంటకు చెందిన యంగ్ ఇండియా సేవా ఫౌండేషన్ సభ్యులు సేవా కార్యక్రమాలు విస్తృతం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం సేవా ఫౌండేషన్ సభ్యుడైన కిరణ్‌కుమార్ కుమారుడు సాయి సాత్విక్ పుట్టిన రోజు సందర్భంగా ఎంఎస్‌వీ ఫౌండేషన్ ఆశ్రమంలోని 80 మంది అన్నదానం చేసినట్లు అధ్యక్షుడు రాజశేఖర్, అనిల్, లక్ష్మణ్ పేర్కొన్నారు.

ఘనంగా ఖాదర్‌వల్లి దర్గా ఉరుసు

మదనపల్లె సిటీ : మతసామరస్యానికి ప్రతీకగాని నిలిచే హజ్రత్ సయ్యద్ ఖాదర్‌వల్లి ఉరుసు ఉత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. స్థానిక బెంగళూరు బస్టాండు వద్దనున్న దర్గాను విద్యుత్‌దీపాలతో అలంకరించారు. దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. స్థానిక దక్నీపేటలోని ఇలియాస్ ఇంటి వద్ద నుంచి గంధం ప్రత్యేక వాహనంలో ఊరేగింపుగా తీసుకువచ్చి దర్గాలో ప్రార్థనలు నిర్వహించారు. దర్గా వద్ద అన్నదానం చేశారు. మాజీ ఎమ్మెల్యే నవాజ్‌బాషా ప్రార్థనల్లో పాల్గొన్నారు. హిందూ,ముస్లిం సోదరులు దర్గాను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. నిర్వాహకులు ఇలియాస్,జమాల్‌బాషా, షేక్ గౌస్‌బాషా, మౌలా పాల్గొన్నారు.

బాలికల చదువు, ఆరోగ్యంపై శ్రద్ధ చూపండి

పెద్దతిప్పసముద్రం : బాలికల చదువు, ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధవహించాలని ఏఎస్‌ఎస్‌ఏ జిల్లా అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్(ఏపీసీ) నాగరత్నంరెడ్డి ఆదేశించారు. శుక్రవారం ఆయన స్థానిక కస్తూర్బా బాలికా విద్యాలయాన్ని తనిఖీ చేశారు. పరిసరాలను శుభ్రంగా ఉంచాలని, సీసీ కెమెరాలపై దృష్టి సారించాలని, మెనూ ప్రకారం భోజనం అమలయ్యేలా చూడాలని ప్రిన్సిపాల్‌కు సూచించారు. అలాగే పదవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. చదువులో వెనుకబడిన బాలికలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అనంతరం ఉపాధ్యాయుల పనితీరు, మధ్యాహ్న భోజనం అమలు, పాఠ్యాంశాలు బోధించే విధానంపై బాలికలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఎంఈఓలు నారాయణ, గౌస్‌పీర్‌తో పాటు సీఆర్పీలు ఉన్నారు.

మసీదు భూములకు రక్షణ కల్పించండి

కలకడ : మండలంలోని మసీదు భూములను పెద్దల పేరుచెప్పి వ్యక్తిగత భూములుగా రికార్డులు పొందాలని కొందరు స్వార్థపరులు చూస్తున్నారు, అలాంటి అక్రమదారులకు రెవెన్యూ శాఖ అధికారులు అవకాశం ఇవ్వకుండా రక్షణ చర్యలు తీసుకోవాలని కలకడ టౌన్ మసీదుల ముతవల్లీలు తహసీల్దార్‌కు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. శుక్రవారం మధ్యాహ్నం అన్ని మసీదులలో ప్రార్థనల అనంతరం ముస్లిం సోదరులు తహసీల్దార్‌ను కలిసి సమస్యను వివరించారు. కలకడ సమీపంలోని గుర్రంకొండ రోడ్డు మార్గంలో ఉన్న సర్వేనెంబర్ 163, 164లోని ఎకరం 5-00 భూమిని కలకడలోని తహసీల్దార్ కార్యాలయ నిర్మాణం కోసం, మసీదుల అభివృద్ధికి 40 సంవత్సరాల క్రితం గ్రామ పెద్దలు, మసీదుల సభ్యులు కొనుగోలు చేసిన విషయం గుర్తు చేశారు. ఈమేరకు ముతవల్లీలు, ముస్లిం సోదరులు సంతకాలు చేసిన వినతిపత్రాన్ని రెవెన్యూశాఖ అధికారులు అందించే నివేదికల వెంట జిల్లాస్థాయి అధికారులకు నివేదించాలని కోరారు.

కరెంటు చార్జీల పేరుతో బా(బు)దుడు



మదనపల్లె: ఈఈ గంగాధరంకు వినతిపత్రం అందిస్తున్న మాజీ ఎమ్మెల్సీ బి.నరేష్‌కుమార్‌రెడ్డి, మనూజారెడ్డి, నాయకులు



పీలేరు : ఈఈకి వినతిపత్రం అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, పార్టీ నాయకులు



బి.కొత్తకోట : డీఈఈ, ఏఈలకు వినతిపత్రం ఇస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

- కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలను నిలుపుకోవాలి
- పెంచిన విద్యుత్ చార్జీలను తక్షణమే తగ్గించాలి
- ఎస్సీ,ఎస్టీలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ కొనసాగించాలి
- జోరువానలోనూ కొనసాగిన వైఎస్సార్ సీపీ పోరుబాట

మదనపల్లె : సూపర్ సిక్స్ పథకాల పేరుతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం, ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నిలుపుకోవాలని, పెంచిన కరెంటు చార్జీలను తక్షణమే తగ్గించాలని మాజీ ఎమ్మెల్సీ బి.నరేష్‌కుమార్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ మనూజారెడ్డి, ఏపీఎండీసీ మాజీ చైర్‌పర్సన్ షమీంఅస్లాం, జెడ్పీటీసీలు ఉదయ్‌కుమార్, సీహెచ్.రామచంద్రారెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం టీడీపీ ప్రభుత్వంలో కరెంటు చార్జీల బాదుడుపై వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో పట్టణంలోని సీటీఎంరోడ్డు ఏపీఎస్పీడీసీఎల్ ఈఈ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి, ఈఈ గంగాధరంకు పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలని వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...చంద్రబాబు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు విద్యుత్ చార్జీలు పెంచమని, ఉన్నవి తగ్గిస్తామని హామీ ఇచ్చారన్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత తగ్గించకపోగా, ఎన్నడూ లేని విధంగా విద్యుత్‌చార్జీలు పెంచి పేదప్రజల నడ్డి విరిచారన్నారు. ప్రజలపై విద్యుత్ ఛార్జీల రూపంలో పెంచిన రూ.15వేల కోట్ల భారాన్ని వెనక్కు తీసుకోవాలన్నారు. అలాగే వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అమలు చేసిన ఎస్సీ,ఎస్టీలకు 200యూనిట్ల వరకు ఉచిత విద్యుత్‌ను కొనసాగించాలన్నారు. వ్యవసాయ పంపు సెట్ల కనెక్షన్లు వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మాదిరిగా అడిగిన వెంటనే రైతులకు అందించాలన్నారు. చంద్రబాబు దోపిడీని నిలువరించేందుకు ప్రజల తరపున వైఎస్సార్ సీపీ పోరాడుతుందన్నారు. వర్షాన్ని సైతం లెక్కచేయకుండా జోరువానలోనే వైఎస్సార్ సీపీ నాయకులు పోరుబాట కార్యక్రమాన్ని కొనసాగించి నిరసన గళం వినిపించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు దండు కరుణాకర్‌రెడ్డి, వెలుగుచంద్ర, సర్పంచ్‌లు ఆనంద పార్థసారధి, బుడ్డయ్య, మహదేవరెడ్డి, ఎంపీటీసీ రాధాకృష్ణరెడ్డి, జిల్లా వక్ఫ్‌బోర్డ్ మాజీ చైర్మన్ ఎస్.ఏ. కరీముల్లా, కేశవరెడ్డి, భాస్కర్‌గౌడ్, కొమ్మేపల్లె శ్రీనివాసులు, ఆర్‌.ఐ.రమణారెడ్డి, రెడ్డిశేఖర్‌రెడ్డి, ఎన్. ఇర్ఫాన్‌ఖాన్, నూర్‌మొహిద్దీన్, ఇస్మాయిల్, చరణ్, కౌన్సిలర్లు సింధలూరి రజని, మేస్త్రీశ్రీనివాసులు, రామిశెట్టిశివయ్య, ఈశ్వర్‌నాయక్, రహీం, శీలంరమేష్, కొత్తపల్లె మహేష్, మునిశేఖర్, అపర్ణ, మల్లికార్జున, తాలేసుబ్బు తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుది బాదుడు పాలన

పీలేరు : ముఖ్యమంత్రి చంద్రబాబుది ప్రజలపై బాదుడు పాలన అని మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. శుక్రవారం వైఎస్సార్‌సీపీ అధిష్టానం పిలుపు మేరకు కరెంట్ చార్జీల బాదుడుపై పీలేరులో పోరుబాటు కార్యక్రమం నిర్వహించారు. స్థానిక వీఎస్ఆర్ కల్యాణ వేదిక నుంచి అధిక సంఖ్యలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ప్లకార్డులు ప్రదర్శిస్తూ పెద్ద ఎత్తున నినాదాలతో విద్యుత్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ట్రాన్స్‌కో ఈఈ చంద్రశేఖర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఆరు నెలలైనా ప్రజలకు ఇచ్చిన ఏ ఒక్క హామీని నెరవేర్చిన పాపాన పోలేదన్నారు. కేవలం అధికారంలోకి రావడం కోసమే సూపర్‌సిక్స్ పథకాలు అంటూ ప్రజలను మభ్యపెట్టి మోసం చేశారని మండిపడ్డారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ప్రతి కుటుంబానికి ఉచిత గ్యాస్ సిలీండర్లు, విద్యార్థులకు ఫీజు రీఎంబర్స్‌మెంట్, అమ్మ ఒడి లాంటి పథకాలు అన్ని విస్మరించారని పేర్కొన్నారు. ప్రజాసంక్షేమాన్ని పట్టించుకోకుండా వైఎస్సార్‌సీపీ శ్రేణులపై అక్రమ కేసులు పెట్టడంలో శ్రద్ధ చూపుతున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్లు దండు జగన్‌మోహన్‌రెడ్డి, రమేష్‌రెడ్డి, వెంకటరమణారెడ్డి, నీళ్ళ భాస్కర్, ముక్తియార్, కమలాకర్‌రెడ్డి, ఎంపీపీలు సతీష్‌రెడ్డి, నూర్జహాన్, ఈశ్వరమ్మ, అప్పల్ల, జెడ్పీటీసీ ఎ.టి. రత్నశేఖర్‌రెడ్డి, సర్పంచ్‌లు హబీబ్‌బాషా, చంద్రారెడ్డి, చెంగల్‌రాయుడు, రాజేష్, నాయకులు కేశవరెడ్డి, మస్తాన్, చక్రధర్, అబ్దుల్ కలీమ్, షాకీర్, మహితా ఆనంద్, హరిత, ఎస్.వి. చలపతి, జయరామచంద్రయ్య, లోకనాథరెడ్డి, రవీంద్ర, నాగరాజమ్మ, సఫూర, తదితరులు పాల్గొన్నారు.

బాదుడుపై కదంతొక్కిన వైఎస్సార్‌సీపీ

బి.కొత్తకోట : ప్రజలపై విద్యుత్ చార్జీల భారం మోపబోమని ఎన్నికల్లో వాగ్దానం చేసిన సీఎం చంద్రబాబు ఇచ్చినమాట మరచి చార్జీల బాదుడుపై శుక్రవారం బి.కొత్తకోటలో ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ శ్రేణులు కదంతొక్కారు. తంబళ్లపల్లె నియోజకవర్గ వ్యాప్తంగా తరలివచ్చిన పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, ప్రజలు పెద్దసంఖ్యలో బి.కొత్తకోటకు తరలివచ్చారు. నిరసన కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి బీసీకాలనీ ఆలయంలో పూజలు నిర్వహించారు. ప్లకార్డులు చేతపట్టిన శ్రేణులు, ప్రజలు అక్కడినుంచి పెరిగిన విద్యుత్ చార్జీలపై నిరసన వ్యక్తం చేస్తూ ర్యాలీ ప్రారంభించారు. చార్జీలు తగ్గించాలని, బాదుడు భారం వద్దు, సూపర్ సిక్స్ హామీలు మోసం, పేదలపై భారం వద్దంటూ నినాదాలు చేస్తూ ప్రభుత్వాన్ని నిలదీశారు. ర్యాలీ పూర్తయ్యే వరకు పోలీసులు ట్రాఫిక్ ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకున్నారు. నియోజకవర్గంలోని బి.కొత్తకోట, పెద్దతిప్పసముద్రం, ములకలచెరువు, పెద్దమండ్యం, తంబళ్లపల్లె, కురబలకోట మండలాల నుంచి నాయకులు తరలివచ్చారు. ర్యాలీలో వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షులు పాగొండ ఖలీల్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ డీఆర్.ఉమాపతి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్లు ఎస్.ప్రదీప్‌రెడ్డి, గణపతి, ఎంపీపీలు మొహమూద్, అనసూయమ్మ, జెడ్పీటీసీలు రామచంద్ర, శివన్న, వైస్ ఎంపీపీలు ఖాదర్‌వలీ, శోభ శంకర, సర్పంచులు నాగిరెడ్డి, గిరిజ రఘునాథరెడ్డి, సాంబశివ, రవికుమార్‌రెడ్డి, పుష్పలత, రుక్మిణి, ఉమామహేశ్వరీ, రామనాథం, చక్రపాణీ నాయుడు, అనసూయమ్మ, భాస్కర్‌నాయుడు, మంజు, సుబ్బిరెడ్డి, ఎంపీటీసీలు రామసుబ్బారెడ్డి, ఈశ్వరమ్మ, అయిషా చాంద్‌బాషా, ఉత్తన్న, కార్యం చంద్ర, జిల్లా కార్యదర్శి టంగుటూరు విశ్వనాథ్, మల్లికార్జున, గౌతంరెడ్డి, పప్పు హరీష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా బి.కొత్తకోట జరిగిన పోరుబాట విజయవంతమైంది. నిరసనకు ప్రజలు తరలిరావడం ప్రభుత్వంపై వ్యతిరేకత స్పష్టమైంది. సీఎం అయ్యేందుకు చంద్రబాబు ఇచ్చిన హామీలు విస్మరించి విద్యుత్ వినియోగంపై చార్జీల మోత మోగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు వైఎస్.జగన్‌మోహన్ రెడ్డి పిలుపు మేరకు నిర్వహించిన పోరుబాట ర్యాలీ అనంతరం స్థానిక విద్యుత్ కేంద్రం వద్దకు చేరుకున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు డిస్కం డీఈఈ కే.గోవిందరెడ్డి, ఏఈ గిరిబాబులకు వినతి పత్రం అందజేశారు.

అమాయకులపై కేసులు పెట్టవద్దు

– డీఎస్పీకి కూటమినేతల విన్నపం

మదనపల్లె : ఇద్దరు వ్యక్తుల మధ్య మొదలైన చిన్నపాటి వివాదం పెద్దదై ఆందోళనకు దారి తీసిన ఘటనలో అమాయకులపై కేసులు పెట్టవద్దని టీడీపీ రాష్ట్ర తెలుగుయువత అధ్యక్షులు శ్రీరామ్‌చినబాబు కోరారు. శుక్రవారం కూటమినేతలతో కలిసి డీఎస్పీ కార్యాలయానికి వెళ్లిన ఆయన, కేసుల విషయమై డీఎస్పీ కొండయ్యనాయుడితో చర్చించారు. రెండు రోజుల క్రితం జరిగిన ఘటన బాధాకరమని, పట్టణంలో శాంతిభద్రతలు కాపాడటంలో పోలీసులు వ్యవహరించిన తీరు, పాటించిన సంయమనం అభినందనీయమన్నారు. వివాదం సద్దుమణిగి, బాధితులు తమకు న్యాయం జరిగిందని సంతృప్తి వ్యక్తం చేశాక, పోలీసులు ఆందోళనలో పాల్గొన్న వ్యక్తులపై కేసులు పెడతామని చెప్పడం బాగోలేదన్నారు. పట్టణంలో మరోసారి ఇలాంటి ఘటన పునరావృతం కాకుండా జాగ్రత్త పడుతామన్నారు. దీనిపై డీఎస్పీ స్పందిస్తూ జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ఆందోళనలో పాల్గొన్న వ్యక్తులపై కేసుల నమోదుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు దొరస్వామినాయుడు, బీజేపీ నాయకులు బండిఆనంద్, జర్మన్‌రాజు, భగవాన్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

స్వామిత్వ సర్వే పారదర్శకంగా చేపట్టాలి



స్వామిత్వ సర్వేపై ఆరా తీస్తున్న అధికారులు

పీలేరు రూరల్ : గ్రామ పంచాయతీలలో స్వామిత్వ సర్వే పారదర్శకంగా చేపట్టాలని జిల్లా పంచాయతీ అధికారి బాలకృష్ణారెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని జాండ్ల పంచాయతీలో శాశ్వత భూహక్కు, భూరక్ష కార్యక్రమ సర్వే కార్యక్రమాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కనీసం సౌకర్యాలైన తాగునీరు, పారిశుద్ధ్యం, వీధిలైట్లు గూర్చి సర్వేలో నమోదు చేయాలన్నారు. స్వామిత్వ సర్వేను ఈ నెలాఖరులోపు పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ లతీఫ్, సర్పంచ్ నీలిమ, పంచాయతీ కార్యదర్శి సిగ్బతుల్లా పాల్గొన్నారు.

భూ సమస్యలపై ప్రతి అర్జీని పరిష్కరిస్తాం

పీలేరు రూరల్ : భూ సమస్యలపై రెవెన్యూ సదస్సులో అందిన ప్రతి అర్జీని పరిష్కరిస్తామని ప్రత్యేకాధికారి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎస్. రమా అన్నారు. శుక్రవారం మండలంలోని పీలేరు గ్రామ పంచాయతీ కార్యాలయంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతు సదస్సులో భూ సమస్యలకు సంబంధించి 29 అర్జీలు వచ్చాయని, ప్రతి అర్జీని ఆన్‌లైన్ చేసి 45 రోజుల్లోపు అర్జీలు పరిష్కరించి చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ భీమేశ్వర్‌రావు, నోడల్ ఆఫీసర్ భరత్‌కుమార్‌రెడ్డి, సర్వేయర్ కిరణ్మయి, వీఆర్వోలు సుధాకర్, ఇబ్రహీం తదితరులు పాల్గొన్నారు.



పీలేరు : రైతుల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న అధికారులు

రెవెన్యూ సదస్సులకు స్పందన

కలకడ : రెవెన్యూ గ్రామ సభలకు విశేష స్పందన లభించినట్లు మండల డిప్యూటీ తహసీల్దార్ భార్గవి తెలిపారు. కోర్టు పరిధిలోలేని రెవెన్యూ సమస్యలను వెంటనే పరిష్కరించడానికి కృషి చేయాలని సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం మండలంలోని కోన సచివాలయంలో నిర్వహించిన సదస్సులో 75 దరఖాస్తులు అందజేశారు. కార్యక్రమంలో వీఆర్ఓ సుచరిత, వీఆర్ఏలు, సచివాలయ సర్వేయర్‌లు పాల్గొన్నారు.

సదస్సులో 348 రెవెన్యూ సమస్యలు

బి.కొత్తకోట : బి.కొత్తకోట గ్రామానికి సంబంధించి శుక్రవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ప్రజల నుంచి 198 ఫిర్యాదు అందాయని తహసీల్దార్ మొహమ్మద్ అన్సారీ తెలిపారు. గురువారం జరిగిన సదస్సులో 150 ఫిర్యాదు వచ్చాయని చెప్పారు. ఇందులో అధికంగా భాగ పరిష్కారాలు, పాసుపుస్తకాలు, ఆన్‌లైన్ సమస్యలపై వినతులు వచ్చాయని, వీటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

తంబళ్లపల్లెలో..

తంబళ్లపల్లె : మండలంలోని కొట్లపల్లెలో శుక్రవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. సదస్సులో ప్రజల నుంచి జాయింట్ ఎల్‌పీఎంలను విడగొట్టి ఐబి మంజూరు చేయాలని 13, రెవెన్యూ రికార్డులలో సవరణల కోసం రెండు, దారి సమస్య పరిష్కరించాని ఒక అర్జీ అందినట్లు తహసీల్దార్ హరికుమార్ తెలిపారు. అర్జీలను ఆన్‌లైన్‌లో నమోదు చేసి రసీదులు ఇచ్చామన్నారు. సదస్సులో ఎఫ్‌బీఓ రామ్‌రాజ్, దేవదాయశాఖ కొండ కిట్టు, ఆర్ఐ ముద్దుక్రిష్ణయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

మట్టితవ్వకాలపై తహసీల్దార్ విచారణ

గుర్రంకొండ : రియల్‌వ్యాపారులు, దళారుల మట్టి తవ్వకాలపై తహసీల్దార్ శ్రీనివాసులు విచారణ చేశారు. శుక్రవారం ప్రచురితమైన తవ్వుకున్నోడికి తవ్వుకున్నంత అన్నవార్తకు రెవెన్యూ అధికారులు స్పందించారు. ఖండ్రిగ గ్రామ పరిధిలో మట్టి తవ్వకాలు జరిపిన గుట్టలను పరిశీలించారు. అక్కడే ఉన్న రైతుల్ని మట్టి తవ్విన వ్యక్తులు, రియల్‌వ్యాపారులపై ఆరా తీశారు. గతంలోనూ పలుమార్లు రియల్‌వ్యాపారులు ఈ గుట్టలో మట్టి తవ్వకాలు జరిపి నర్సరీలకు, స్థలాల చదును కోసం మట్టిని తరలించారని రైతులు తహసీల్దార్ దృష్టికి తీసుకొచ్చారు. మట్టితవ్వకాలు జరిపిన గుట్టల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని వీఆర్వోను ఆదేశించారు. మట్టి తవ్వకాలు జరిపే గుట్టలపై ఎవరకి హక్కులేదని వీటికి పట్టాలు ఇవ్వలేదన్నారు. ఎవరైనా నిబంధనలు ఉల్లంఘించి ఇక్కడ మట్టి తవ్వకాలు జరిపితే చట్టపరంగా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈపరిసరాల్లో మట్టి తవ్వకాలు జరిపే రియల్‌వ్యాపారులు, దళారుల వివరాలు సేకరించారు. అనంతరం ఆక్రమణలకు గురైన మురాద్‌బీ వంకను పరిశీలించారు. సర్వేనెంబర్లు 501,502,503 సర్వే నెంబర్లలో ఉన్న మురాద్‌బీ వంకను పరిశీలించారు. సర్వే నెంబరు 506/8లో సుమారు 25 సెంట్లు భూమి ఆక్రమణకు గురైనట్లు వీఆర్వో ఆయన దృష్టికి తీసుకొచ్చారు. ఆక్రమణకు గురైన భూమికి హద్దుని నిర్ణయించి జే సీబీతో ట్రెంచ్ ఏర్పాటు చేయాలన్నారు. ఆయన వెంట వీఆర్వోలు సదాశివ, అమీర్, సర్వేయర్లు వినోద్, నందినీ ఉన్నారు.



మట్టితవ్వకాలు జరిపిన గుట్టలను పరిశీలించిన అధికారులు

ఆరోగ్య వివరాల నమోదులో నిర్లక్ష్యం వద్దు

కేవీపల్లె : ఆరోగ్య వివరాల నమోదులో నిర్లక్ష్యం వహించరాదని జిల్లా గణాంకాల అధికారి ఓబుల్‌రెడ్డి, నేషనల్ హెల్త్ మిషన్ కార్యక్రమ అధికారి మునిరాజ, ఆరోగ్య విద్య బోధకులు బలరామరాజు అన్నారు. శుక్రవారం మండలంలోని వగళ్లలో ఉన్న హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్‌ను జిల్లా టాస్క్‌ఫోర్స్ టీం తనిఖీ చేసింది. రిజిష్టర్లను పరిశీలించి, ఆర్‌సీహెచ్, యూవిన్, హెచ్‌ఎంఐఎస్ పోర్టల్స్‌లో నమోదైన వివరాలతో సరిపోల్చారు. గ్రామంలో ఎంపిక చేయబడిన గర్భవతులకు, చిన్నపిల్లలకు రక్త పరీక్షలు నిర్వహించి పోర్టల్స్‌లో నమోదైన హిమోగ్లోబిన్ లెవెన్స్‌ని పరిశీలించారు. అలాగే మాతా శిశు సంరక్షణ కార్డులలోని వివరాలు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీహెచ్‌వోలు, ఏఎన్‌ఎంలు అన్ని జాతీయ ఆరోగ్య కార్యక్రమాల్లో సమన్వయంతో సమిష్టిగా పని చేసి గ్రామీణులకు సేవలందించాలన్నారు. అనంతరం నారామాకులపల్లెలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించారు. ఈ కార్యక్రమంలో గర్నిమిట్ట పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ రేష్మ, సీహెచ్‌వో భాగ్యలక్ష్మీ, పీహెచ్‌ఎన్ రమాదేవి, సూపర్‌వైజర్లు రుక్మిణి, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.



ఆరోగ్య సిబ్బందికి సూచనలిస్తున్న జిల్లా ఆరోగ్య విద్యాబోధకులు బలరామరాజు

ములకలచెరువు మండలమీట్ నిర్వహించండి

- వారంలోగా నిర్వహించాలని హైకోర్టు ఆదేశాలు
- కోర్టు ఆర్డర్‌ను ఎంపీడీఓకి సమర్పించిన ప్రజాప్రతినిధులు

ములకలచెరువు : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అధికారుల ఏకపక్ష ధోరణి, ప్రజా సమస్యల నిర్లక్ష్యం, అభివృద్ధిని అడ్డుకోవడమే లక్ష్యంగా వ్యవహరిస్తూ సమావేశాల నిర్వహణకు అడ్డు తగులుతున్నారు. దీంతో ములకలచెరువు ఎంపీపీ సాయిలీలా హైకోర్టును ఆశ్రయించగా అధికారులకు చెంపపెట్టు లాంటి తీర్పు వచ్చింది. పంచాయతీ రాజ్ చట్టాన్ని అనుసరించి వారంలోగా మండలమీట్ నిర్వహించాలని అధికారులకు ఆదేశించింది. తంబళ్లపల్లె నియోజకవర్గంలో కూటమి ప్రభుత్వ నాయకులు గ్రామాల్లో అభివృద్ధిని అడ్డుకోవడమే కాకుండా మండల్‌మీట్ సమావేశాలను జరగనివ్వకుండా అడ్డుపడుతూ శాంతిభద్రతల సమస్యను సృష్టిస్తున్నారు.



మండలమీట్ నిర్వహించాలని ఏఓ కు వినతి పత్రం ఇస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ, ఎంపీటీసీలు

అధికారుల అత్యుత్సాహంతో ఆగిన మండల్ మీట్

ములకలచెరువు మండలమీట్ సమావేశాన్ని గత నెల నవంబర్ 30వ తేదీ నిర్వహిస్తున్నట్లు అధికారులు సర్కులర్ జారీ చేశారు. సమావేశానికి వైఎస్సార్‌సీపీ ఎంపీపీ, ఎంపీటీసీలు, సర్పంచులను రానియ్యకుండా ఎంపీడీఓ కార్యాలయానికి కూటమి నాయకులు తాళం వేసి కార్యాలయం ఎదుట తిష్ట వేశారు. అధికారులు సైతం వారి వంతు పలకడంతో ఘర్షణలకు తావు ఇవ్వకుండా వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు వెనుతిరిగి జరిగిన ఘటనపై జిల్లా అధికారులకు విన్నవించారు. కోరం లేదంటూ... సమావేశం వాయిదా వేస్తున్నట్లు అధికారులు అత్యుత్సాహంతో ఎంపీపీకి ఎటువంటి సమాచారం అందించకుండా కార్యాలయం ఎదుట నోటీసు అతికించారు.

వారం రోజుల్లో నిర్వహించండి

మండలమీట్ సజావుగా జరిగేందుకు ఎంపీపీ సాయిలీలా హైకోర్టును ఆశ్రయించారు. సమావేశం జరగకుండా అడ్డుపడిన ఘటనలకు సంబంధించిన వివరాలు, అధికారుల తీరుపై ఆధారాలను సమర్పించారు. హైకోర్టు ఈ మేరకు తీర్పు ఇస్తూ నిబంధనల మేరకు వారంలోగా సమావేశం నిర్వహించాలని, శాంతిభద్రతల సమస్య లేకుండా సజావుగా సమావేశం నిర్వహించాలని ఆదేశించింది. ఈ మేరకు ఎంపీపీ, ఎంపీటీసీలు శుక్రవారం ఏఓ వై.దివాకర్‌రెడ్డికి వినతి పత్రం అందించారు. సమస్యలు లేకుండా మండల మీట్ నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు మోహన్‌రెడ్డి, ఎంపీపీ సాయిలీలా, ఎంపీటీసీలు సుష్మీత, మహేశ్వరీ, ఆయిషా, క్రిష్ణప్ప, పెద్ద నరసింహులు, నాయకులు వై. రవిశేఖర్‌రెడ్డి, రాంబాబు, ఉమామహేశ్వర్, వెంకరమణారెడ్డి, కుల్‌దీప్, చాంద్‌బాషా, మంజునాథ్, రెడ్డిశేఖర ఉన్నారు.

ఆర్థిక సంస్కరణల రూపశిల్పి మన్మోహన్ సింగ్



మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు



బి.కొత్తకోట : మన్మోహన్ సింగ్ చిత్రపటానికి నివాళులు

మదనపల్లె : భారత మాజీ ప్రధాని, దేశ ఆర్థిక సంస్కరణల రూపశిల్పి మన్మోహన్‌సింగ్ మరణం దేశానికి తీరని లోటని మాజీ ఎమ్మెల్సీ బి.నరేష్‌కుమార్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ మనూజారెడ్డి, ఏపీఎండీసీ మాజీ చైర్‌పర్సన్ షమీంఅస్లాం, జెడ్పీటీసీ ఉదయ్‌కుమార్ అన్నారు. శుక్రవారం వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో, మన్మోహన్ సింగ్ మృతికి సంతాపసూచకంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... మన్మోహన్‌సింగ్ ఆర్బీఐ గవర్నర్‌గా, ఆర్థికమంత్రిగా ఆర్థిక సంస్కరణలతో దేశప్రోభివృద్ధికి ఎంతగానో కృషి చేయడమే కాకుండా పదేళ్లపాటు దేశ ప్రధానిగా గొప్ప సేవలందించారని ప్రశంసించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు కేశవరెడ్డి, భాస్కర్‌గౌడ్, గౌడసాని వెంకటరమణ, శీలంరమేష్, రహీం, వెలుగుచంద్ర, ఆనందపార్థసారధి, బండపల్లె అక్కులప్ప, కౌన్సిలర్ సింధలూరి రజని, అపర్ణ తదితరులు పాల్గొన్నారు.

మన్మోహన్‌సింగ్ సేవలు ఆదర్శం

తంబళ్లపల్లె : మాజీ ప్రధానమంత్రి మన్మోహన్‌సింగ్ ఆర్థికవేత్తగా, ప్రధానమంత్రిగా దేశానికి చేసిన సేవలు ఆదర్శమని మోడల్‌స్కూల్ ప్రిన్సిపాల్ హేమంత్‌కుమార్ అన్నారు. శుక్రవారం పాఠశాలలో మాజీ ప్రధానమంత్రి మన్మోహన్‌సింగ్ మృతి చెందిన సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆయన దేశాభివృద్ధికి చేసిన సేవలను కొనియాడారు. ఆయన మృతికి సంతాపం తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మన్మోహన్ సింగ్ మృతి తీరని లోటు


పీలేరు : దేశ మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్‌సింగ్ మృతి తీరని లోటని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి సోమశేఖర్‌రెడ్డి, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి టి.ఎల్. వెంకటేష్ అన్నారు. శుక్రవారం స్థానిక అంబేడ్కర్ సర్కిల్ వద్ద మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి పూల మాలలతో నివాళులర్పించారు.

మాజీ ప్రధాని మృతికి సంతాపం

బి.కొత్తకోట : మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతికి సంతాపం వ్యక్తం చేస్తూ స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో శుక్రవారం ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంఈవోలు రెడ్డిశేఖర్, భీమేశ్వరాచారీ మాట్లాడుతూ ఆర్బీఐ గవర్నర్‌గా, ప్రధానిగా మన్మోహన్ సింగ్ దేశ ఆర్థిక శక్తిని ప్రపంచానికి చాటి చెప్పారన్నారు. ఆర్థిక సంస్కరణలతో దేశాన్ని పురోగతిలో నడిపించిన గొప్ప ఆర్థికవేత్తని కొనియాడారు.

హెల్మెట్ వినియోగంపై అవగాహన

మదనపల్లె : ద్విచక్రవాహనదారులు హెల్మెట్ ధరించకపోవడంతో చాలా మంది రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోతున్నారని, హెల్మెట్ ధరించి వాహనాలు నడపటం వలన ఒక రక్షణ కవచంలా ఉపయోగపడుతుందని రూరల్ సీఐ రమేష్ అన్నారు. శుక్రవారం రామసముద్రంలో పోలీస్ సిబ్బందితో కలిసి హెల్మెట్ వాడకం వలన కలిగే ప్రయోజనాలను వాహనదారులకు వివరించారు. ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించి తమ విలువైన ప్రాణాలు కాపాడుకోవాలని సూచించారు. అనంతరం రామసముద్రం పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేసి వివిధ కేసులకు సంబంధించి రికార్డులను పరిశీలించారు. పెండింగ్ కేసులను సత్వరమే విచారించి పరిష్కరించాలని ఆదేశించారు. అక్రమంగా రేషన్ బియ్యం సరిహద్దులు దాటుతుంటే పట్టుకోవాలన్నారు. గ్రామాల్లో కర్నాటక మద్యం, నాటుసారా విక్రయించకుండా చర్యలు తీసుకుని, విక్రేతలపై కేసులు నమోదుచేయాలన్నారు.



హెల్మెట్ ప్రయోజనాలను వివరిస్తున్న రూరల్ సీఐ రమేష్